## క్లుప్తంగా

### ఆక్వా రంగంలో అవకాశాలపై సదస్సు



లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆక్వా కల్చర్, ఆక్వా డయాగ్నోస్టిక్స్ రంగాల్లో అవకాశాలపై శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల జంతు, మత్స్య సాంకేతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథులుగా జెనీసిస్ బయో సైన్సెస్ ఫౌండర్ బి.అమరేంద్ర, ఒమిక్స్ నెక్స్‌జెన్ లేబొరేటరీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.మధుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ జీవ సాంకేతిక విజ్ఞానం, వ్యాధి నిర్ధారణ గురించి వివరించారు. అనుజీవశాస్త్రం, పీసీఆర్, ఆర్టీపీసీఆర్, డీఎన్ఏ ప్రతిరూపం గురించి, వాటిని ఉపయోగించి మన కంటికి కనిపించని సూక్ష్మజీవులు సృష్టించే వ్యాధులకు ఎలా తెలుసుకుంటామో వివరించారు. ఈ విజ్ఞాన విధానాలను ఉపయోగించి వాటిని గుర్తించి ఎలా నిర్మూలించవచ్చునో తెలిపారు. అనంతరం అమరేంద్ర మాట్లాడుతూ మత్స్య పరిశ్రమలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ఉద్యోగ అవకాశాలు ల్యాబ్స్, ప్రాసెసింగ్ యూనిట్స్, మార్కెటింగ్, హేచరీస్, టీచింగ్, ఫీడ్ మిల్స్, ఆక్వా కన్సల్టెంట్‌గా కూడా రాణించవచ్చునన్నారు. సదస్సులో జంతుశాస్త్ర విభాగాధిపతి కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల నుంచి పరస్పర సహకారం అందించుకునేందుకు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు.

### పత్రికలు జనం పక్షాన నిలవాలి

**సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు**

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): పత్రికలు జనం పక్షాన నిలవాలని ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం సందర్భంగా నాగార్జున యూనివర్సిటీ, ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జర్నలిజం డిప్లొమో కోర్సు ఆన్‌లైన్ తరగతులకు బుధవారం హాజరైన వారిని ఉద్దేశించి కొమ్మినేని శ్రీనివాసరావు ప్రసంగించారు. 1991లో ఆఫ్రికన్ జర్నలిస్టులు విడుదల చేసిన ఒక ప్రకటన ఆధారంగా యునెస్కో అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇదే రోజున ఆయా దేశాల్లో మీడియా స్వేచ్ఛపై ర్యాంకింగ్‌లు ప్రకటిస్తారని తెలిపారు. చైనాలో కంటే మనదేశంలోనే పత్రికా స్వేచ్ఛ చాలా మెరుగ్గా ఉందని కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు.

# కృష్ణపట్నం పోర్టు, గతిశక్తి టెర్మినల్ తనిఖీ



కృష్ణపట్నం పోర్టు అధికారులతో సమీక్షిస్తున్న పీసీసీఎమ్ రవీన్‌కుమార్ రెడ్డి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య ప్రిన్సిపల్ రైల్వే చీఫ్ కమర్షియల్ మేనేజర్ (పీసీసీఎమ్) రవీన్‌కుమార్ రెడ్డి బుధవారం విజయవాడ డివిజన్‌లోని అదాని కృష్ణపట్నం పోర్టు ప్రైవేట్ సైడింగ్ లిమిటెడ్, బీపీసీఎల్ గతిశక్తి కార్గో టెర్మినల్‌లను తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ముందుగా అదాని కృష్ణపట్నంను తనిఖీ చేసి 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఎన్నడూ లేని విధంగా అత్యధికంగా బొగ్గు లోడింగ్ సాధించడంలో పోర్టు అధికారుల సహకారాన్ని ప్రశంసించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పనితీరు, రాబోయే త్రైమాసికాల్లో లోడింగ్ అంచనాలు, సరుకు రవాణా ఆదాయ అంచనాలపై పోర్టు అధికారులతో చర్చించారు. అనంతరం లోడింగ్ పాయింట్‌లు, వే బ్రిడ్జి, టార్పాలిన్ ప్యాకింగ్ విధానాన్ని పరిశీలించారు. ప్రస్తుత డిమాండ్‌లో ఉన్న సరుకు రవాణా లక్ష్యాన్ని సాధించేందుకు రైల్వేశాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

అనంతరం నూతనంగా ప్రారంభించిన బీపీసీఎల్ గతిశక్తి కార్గో టెర్మినల్‌ను ఆయన పరిశీలించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పెట్రోలియం, ఆయిల్ లూబ్రికెంట్‌ల లోడింగ్ అంచనాలపై చర్చించారు. లోడింగ్ పాయింట్‌లు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు, భద్రతా చర్యలను పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గంలో నెల్లూరు రైల్వే స్టేషన్ చేరుకుని ప్లాట్‌ఫారాలను పరిశీలించారు. ప్రయాణికులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో జరుగుతున్న రీడెవలప్‌మెంట్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాల్సిందిగా సూచించారు. ఈ పర్యటనలో పీసీసీఎమ్‌తో పాటు సీనియర్ డీసీఎం వావిళ్లపల్లి రాంబాబు, ఏసీఎం రవివర్మ, ఏఓ తేజస్ తదితరులు ఉన్నారు.

# మతతత్వ అజెండా అమలే బీజేపీ లక్ష్యం

**ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు**



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పాఠ్యాంశాలలో చరిత్రను తొలగించి మతతత్వ అజెండాను అమలు చేయడమే బీజేపీ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు అన్నారు. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మొవ్వా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బుధవారం పాఠ్యాంశాలలో డార్విన్ జీవపరిణామ సిద్ధాంత తొలగింపుపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ పదో తరగతి పాఠ్యాంశాలలో డార్విన్ సిద్ధాంతం తొలగింపును ఖండిస్తూ 1800 మంది చరిత్రకారులు రాష్ట్రపతికి మెమోరాండం ఇచ్చారన్నారు. పదకొండో తరగతి పాఠ్యాంశాలలో ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఎట్ వర్క్ అనే ఒక పాఠంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ గురించి తొలగించారన్నారు. హిస్టరీ లెక్చరర్ అజయ్‌బాబు మాట్లాడుతూ డార్విన్ పరిణామ క్రమాన్ని తొలగించటమంటే ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని తీసివేయడమేనన్నారు. సమావేశంలో ఎం.బి.విజ్ఞాన కేంద్ర బాధ్యులు ఎస్.పి.రామరాజు, టి.క్రాంతి, యు.వి.రామరాజు, ఉషారాణి, వెలగా శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కొండపల్లిలో భారీ వర్షం



జలమయం అయిన ప్రధాన రోడ్డు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో బుధవారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి పట్టణంలోని రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధాన రోడ్డులో డ్రెయినేజీ ఆక్రమణకు గురికావడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. దీంతో రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు, వాహనదారులు అవస్థలు పడ్డారు. మున్సిపాల్టీ పారిశుద్ధ్యం కార్మికులు డ్రెయినేజీల్లో పూడుకుపోయిన చెత్తను తొలగించి, వాననీరు పారుదల అయ్యేలా చేశారు.

### 7న దేవతా విగ్రహాల ప్రతిష్ట

విస్సన్నపేట: మండలంలోని తాతకుంట్ల తండాలో ఈ నెల 7వ తేదీ ఉదయం 10.45 గంటలకు కోదండరామస్వామి వారి పరివారదేవతా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

# లారీని ఢీకొన్న టీఎస్ ఆర్టీసీ బస్సు

- 23 మందికి స్వల్ప గాయాలు
- మరొకరి పరిస్థితి విషమం
- డ్రైవర్ నిద్ర మత్తే కారణం
- జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు వద్ద ఘటన



చిల్లకల్లు వద్ద లారీని ఢీకొట్టిన టీఎస్ ఆర్టీసీ బస్సు



క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బంది



తీవ్రంగా గాయపడిన కొనిశెట్టి లక్ష్మి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): లారీని బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒకరు తీవ్రంగా మరో 23 మంది స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ప్రమాదం ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజాము ఐదు గంటల సమయంలో జరిగింది. తెలంగాణకు చెందిన ఆర్టీసీ రాజధాని బస్సు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాలకు చెందిన 37 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి విజయవాడకు బయలుదేరింది. ఈ క్రమంలో గ్రామంలోని ఫ్లైవోవర్ పై నుంచి కిందకు దిగుతున్న బస్సు అదే సమయంలో గ్రామంలోని సర్వీస్ రోడ్డు నుంచి 65వ నంబరు జాతీయ రహదారి ఎక్కేందుకు వస్తున్న లారీని పెట్రోల్ బంకు సమీపంలో వెనుకగా ఢీకొట్టింది. ఈ సమయంలో ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నారు. లారీని బస్సు ఢీకొన్న సమయంలో పెద్ద శబ్దం వచ్చింది. ప్రయాణికులు ఒకరిపై ఒకరు పడి భయంతో ఆర్తనాదాలు చేశారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న సమీపంలోని జీఎంఆర్ టోల్‌ప్లాజా సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు.

పోలీసులు కూడా వచ్చి టోల్‌ప్లాజా సిబ్బందితో కలిసి ప్రయాణికులను బస్సు నుంచి బయటకు తీసుకువచ్చారు. డ్రైవర్ తన్నీరు లక్ష్మీనారాయణ తన సీటులో ఇరుక్కుపోవటంతో బయటకు తీసేందుకు పోలీసులు రెండు గంటల పాటు శ్రమించారు. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ రెండు కాళ్లు విరిగాయి.

బస్సులో ప్రయాణిస్తున్న తూర్పుగోదావరి జిల్లా ఎస్.అన్నవరానికి చెందిన కొనిశెట్టి లక్ష్మి అనే మహిళకు తీవ్ర గాయాలై పరిస్థితి విషమించటంతో విజయవాడ తరలించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ప్రాణనష్టం లేకపోవటంతో ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

**ఉదయభాను చొరవతో అంబులెన్స్‌లు ఏర్పాటు**

ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ప్రభుత్వ, ప్రైవేట్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేయించి గాయపడిన 24 మందిని జగ్గయ్యపేట, విజయవాడ ప్రభుత్వాస్పత్రులకు తరలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కట్టా వీరబాబు వైద్యులతో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ తరలించారు. ఈ ప్రమాదానికి డ్రైవర్ నిద్ర మత్తు కారణమని అధికారులు అంటున్నారు. ఘటనా స్థలాన్ని విజయవాడ డీసీపీ అజిత, ఏసీపీ జనార్దన్ నాయుడు, సీఐ జానకిరామ్, ఎస్ఐ దుర్గాప్రసాద్ తదితరులు పరిశీలించారు.

# హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితుల అరెస్టు

- హత్యాయత్నం చేసింది ముగ్గురు
- పురికొల్పింది ఇద్దరు
- రూ.2 లక్షలు సుపారీకి ఒప్పందం
- నిందితులను అరెస్టు చేసిన కంకిపాడు పోలీసులు



నిందితులను మీడియా ఎదుట హాజరుపర్చి వివరాలు వెల్లడిస్తున్న సీఐ పరమేశ్వర్, ఎస్ఐ సుధాకర్

కంకిపాడు: హత్యాయత్నం కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చినట్లు కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వర్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఎస్ఐ కె.సుధాకర్‌తో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచారు. సీఐ పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన వెన్న సుబ్బారావుపై గత నెల 29న ఆటోనగర్‌లో దుకాణం మూసివేసి బైక్‌పై అర్ధరాత్రి సమయంలో వస్తుండగా వెనుకగా బైక్‌పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు పునాదిపాడు–గొల్లగూడెం మార్గమధ్యంలో బైక్‌తో ఢీకొట్టి అరటికాయలు కోసే కత్తి, కోడికత్తులతో పొడిచారు. తీవ్ర గాయాలపాలైన సుబ్బారావు విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదుతో హత్యాయత్నం కేసు నమోదైంది. కోపూరి పెద్ద వాసు తనపై హత్యాయత్నం చేయించాడని బాధితుడు ఫిర్యాదులో పేర్కొనటంతో సీసీ ఫుటేజ్ ఆధారంగా హత్యాయత్నంకు పాల్పడ్డ నిందితులను గుర్తించారు. జిల్లా ఎస్పీ పి.జాషువా, ఇన్‌చార్జి డీఎస్పీ సత్యానందం సూచనలతో ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు జరిపారు. గునపర్తి ప్రసాద్, ఆళ్ల గణేష్, మోపాడ దుర్గాప్రసాద్ హత్యాయత్నంకు పాల్పడ్డట్లు, వారిని కోపూరి చిన్న వాసు, కోపూరి పెద్ద వాసు హత్యాయత్నంకు పురికొల్పినట్లు పోలీసుల విచారణలో తేలింది. కోపూరి పెద్ద వాసు, వెన్న సుబ్బారావుకు మధ్య పాత గొడవలే హత్యాయత్నంకు దారితీసినట్లు విచారణలో స్పష్టమైంది. శ్రీకాకుళం, బాపట్ల, పటమట ప్రాంతాల్లో నిఘా వేసి హత్యాయత్నానికి పథకం రూపొందించిన కోపూరి చిన్న వాసు, కోపూరి పెద్దవాసు, హత్యాయత్నంకు పాల్పడ్డ గునపర్తి ప్రసాద్, ఆళ్ల గణేష్, మోపాడ దుర్గాప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నారు. హత్య చేసేందుకు రూ.2 లక్షలు సుపారీకి ఒప్పందం కూడా చేసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. పెద్ద వాసు, గునపర్తి ప్రసాద్, ఆళ్ల గణేష్, మోపాడ దుర్గాప్రసాద్‌లపై పలు పోలీసుస్టేషన్‌లో కేసులు కూడా ఉన్నాయి. నిందితులను బుధవారం అరెస్టు చేసి, వారి వద్ద నుంచి బైక్, హత్యాయత్నంకు వినియోగించిన అరటికాయలు కోసే కత్తి, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకున్నారు. కేసును త్వరితగతిన ఛేదించినందుకు జిల్లా ఎస్పీ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

**ఉయ్యూరు చైన్‌స్నాచింగ్ కేసులో నిందితుల అరెస్టు**

ఉయ్యూరులో జరిగిన చైన్‌స్నాచింగ్ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ పరమేశ్వర్ తెలిపారు. బుధవారం ఆయన కంకిపాడులో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 31న ఉయ్యూరు పట్టణంలో అడ్రస్ అడిగే నెపంతో ఇద్దరు వ్యక్తులు వృద్ధురాలిని పలకరించి ఆమె మెడలో ఉన్న 4.5 కాసుల బంగారు గొలుసు అపహరించుకుపోయారన్నారు. కేసు నమోదు చేసి 3 ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి నిందితుల కోసం గాలింపు జరిపామన్నారు. వైజాగ్ సమీపంలోని గాజువాక వద్ద చైన్‌స్నాచింగ్ నిందితులు ప్రవీణ్‌కుమార్, డానియేలును గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని వివరించారు. అపహరించుకుపోయిన 4.5 కాసుల బంగారు ఆభరణాన్ని ఓ ప్రైవేటు సంస్థలో కుదువ పెట్టారని, త్వరలోనే రికవరీ చేస్తామని వివరించారు.

### బస్సు ఇంజిన్‌లో చెలరేగిన మంటలు



జి.కొండూరు: బస్సు ఇంజిన్‌లో మంటలు చెలరేగిన ఘటన జి.కొండూరు మెయిన్ సెంటర్లో బుధవారం మధ్యాహ్నం జరిగింది. వివరాలలోకి వెళ్తే...ఇబ్రహీంపట్నం డిపోకి చెందిన ఏపీఎస్ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో విజయవాడ నుంచి మైలవరం వెళ్తూ బుధవారం మధ్యాహ్నం జి.కొండూరు మెయిన్ సెంటర్లో ఆగింది. ఆ సమయంలో బస్సు ఇంజిన్‌లో మంటలు చెలరేగడం గమనించిన డ్రైవర్, కండక్టర్ వెంటనే అప్రమత్తమై స్థానికుల సాయంతో మంటలను అదుపు చేశారు. దీంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

### వీల్‌చైర్ అందజేత



జి.కొండూరు: నడవలేని స్థితిలో ఉన్న బాధితుడికి జి.కొండూరు ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వేములకొండ రాంబాబు చేయూతనిచ్చారు. జి.కొండూరు గ్రామానికి చెందిన కూరెళ్ల సురేష్ ఇటీవల ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి పడిన క్రమంలో రెండు కాళ్లు సచ్చుబడి నడవలేని స్థితిలో నరకయాతన పడుతున్నాడు. సమాచారం అందుకున్న ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ వీల్‌చైర్‌ను బుధవారం అందజేశారు. వేములకొండ రాంబాబు రూ.5వేలను అందించారు. బాధితుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మండల అరుణ, ఎంపీటీసీ సభ్యుడు కందుల యేసురాజు పాల్గొన్నారు.

# ఘనంగా గంగానమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు



పూజలో పాల్గొన్న గ్రామస్తులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని శ్రీగంగానమ్మ అమ్మవారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆరు గంటల నుంచి గణపతి పూజ, అఖండ దీపారాధన, కలశ స్థాపన, కృష్ణానదీ జలాలతో అభిషేకం, బొడ్డురాయి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటలకు పవన భక్త బృందం భజన చేశారు. అనంతరం అమ్మవారి శేషవస్త్రాలను వేలం వేశారు. బ్రహ్మోత్సవాల్లో రెండవ రోజైన గురువారం ఉదయం 11.30 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం ఆరు గంటలకు అమ్మవారికి పంచామృత అభిషేకం(పళ్లరసాలతో), ఆనవాయితీ వారితో చల్ది నైవేద్యం, గంగానమ్మ అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ సేవా సమితి సభ్యులు తెలిపారు.

## సంక్షిప్తం

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

తిరువూరు: తిరువూరు నగరపంచాయతీలోని 20వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ తెలిపారు. ఉదయం ఏడు గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొంటారని పేర్కొన్నారు.

### నేడు జగనన్న కాలనీకి సబ్‌కలెక్టర్ రాక

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న హౌసింగ్ లేఅవుట్‌ను సబ్‌కలెక్టర్ అదితిసింగ్ గురువారం పరిశీలించనున్నారు. కొండపల్లి రూరల్, అర్బన్ లేఅవుట్‌లో సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన విధానాలపై ఆయా శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు కౌన్సిలర్‌లు, లబ్ధిదారులతో సమీక్ష నిర్వహించనున్నారు. గ్రామ కార్యదర్శులు ఆయా గ్రామాలకు సంబంధించిన లబ్ధిదారులను లేఅవుట్ వద్ద సమావేశానికి తీసుకురావాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు కోరారు.

### బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

తిరువూరు: తిరువూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా సంకురాత్రి జనార్దనరావు, ఉపాధ్యక్షుడిగా జీవన్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా అంజన్ రెడ్డి ఎన్నికయ్యారు. లైబ్రేరియన్‌గా రాము, కోశాధికారిగా సతీష్ ఎన్నికయ్యారు.

### నేడు నృసింహ జయంతి

ఆగిరిపల్లి: స్థానిక శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయంలో గురువారం నృసింహ జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ ఎస్.భవాని తెలిపారు. ఉదయం ఆలయంలో ఆవిర్భావ ఉత్సవం, పంచామృత స్నపన, విశేష పుష్పాలంకరణ, లక్ష్మీ నృసింహ మూలమంత్ర హోమం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### అనాథ బాలలకు చేయూత

తిరువూరు: తల్లిదండ్రులను కోల్పోయిన ఇరువురు బాలికలకు తిరువూరుకు చెందిన ఒక దాత బుధవారం ఆర్థికసాయం అందజేశారు. స్థానిక మెయిన్ రోడ్డులోని స్వామి అయ్యప్ప మెడికల్స్ నిర్వాహకులు మోదుగుల రవిచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఇరువురు బాలికలకు రూ.10వేల చొప్పున సాయంతో పాటు దుస్తులు, పాదరక్షలను వితరణగా ఇచ్చారు. పరిపూర్ణ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు సిరికొండ అభి పాల్గొన్నారు.

### మొదటి విడత పాఠ్యపుస్తకాల సరఫరా

గంపలగూడెం: వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుకలో భాగంగా పంపిణీ చేయనున్న పాఠ్యపుస్తకాల్లో మొదటి విడతగా 17వేల పుస్తకాలను ఉన్నతాధికారులు బుధవారం సరఫరా చేసినట్లు ఎంఈఓ సోమశేఖర్‌నాయక్ తెలిపారు. మండలంలోని 73 ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు 30వేల పాఠ్యపుస్తకాలు అవసరం ఉందని పేర్కొన్నారు. సరఫరా పుస్తకాలను గంపలగూడెం ఎంఆర్సీలో దిగుమతి చేసుకున్నట్లు తెలిపారు.

# యువకుడికి ఆర్థిక సాయం


బాధితుడి తండ్రికి నగదుని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చాట్రాయి: అనారోగ్యంతో బాధపడుతోన్న యువకుడికి స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి చెందిన మిద్దె అఖిల్ కొంతకాలంగా హార్మోఫిలియా అనే వ్యాధితో బాధపడుతూ ఖమ్మం అపెక్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులు ఎక్కువగా కావడంతో సోషల్ మీడియా ద్వారా ఆర్థిక సాయం అభ్యర్థించారు. దీనికి స్పందించిన యువ భారత్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా ద్వారా సేకరించిన రూ.40 వేలుని ఫౌండేషన్ ఇన్చార్జి అవినాష్‌రెడ్డి అఖిల్ తండ్రి వెంకటేశ్వరావుకి బుధవారం అందజేశారు.

## ఉపాధి పనులకు 3,604 మంది హాజరు

నూజివీడు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనుల్లో 3,604 మంది కూలీలు పాల్గొన్నట్టు ఏపీఓ సోమేశ్వరి తెలిపారు. మామిడి చెట్లకు పాదులు చేయడం, చెరువులకు నీళ్లు వచ్చే సప్లయ్ ఛానళ్ల బాగుచేత, ఫీడర్ ఛానళ్లలో పూడికతీత, మట్టిరోడ్ల నిర్మాణం, గట్టులను బలపరచడం తదితర పనులు చేపట్టినట్టు చెప్పారు.

## జూదరుల అరెస్టు

ఆగిరిపల్లి: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో పేకాడుతోన్న 12 మందిని అరెస్టు చేసినట్టు ఎస్సై ఎస్.చంటిబాబు తెలిపారు. మండలంలోని వడ్లమాను, బొద్దనపల్లి గ్రామాల్లో పేకాడుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్సై తన సిబ్బందితో ఆయా ప్రాంతాలకు వెళ్లి పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,580 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.



# ప్రభుత్వ కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలి

ఎమ్మెల్యే రక్షణనిధి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ఏ.కొండూరు: ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి పేర్కొన్నారు. మండలంలోని వల్లంపట్ల రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రబీ సీజన్లో రైత భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏగ్రేడ్ రకం 75 కేజీలు రూ.1,545లు, కామన్‌రకం రూ. 1,530లు ప్రభుత్వ ధర లభిస్తుందన్నారు. ధాన్యం సేకరణలో రైతన్నకు ఎటువంటి ఆర్థిక భారం, శ్రమ లేకుండా అదనపు ప్రయోజనాలు కల్పిస్తున్నామన్నారు. ధాన్యం మద్దతు ధరతో పాటు హమాలీల చార్జీలు, రవాణా ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ధాన్యాన్ని విక్రయించిన నగదును రైతు బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేష్, ఎంపీపీ కాలసాని నాగలక్ష్మీ, పీఏసీఎస్ చైర్మన్ తుమ్మూరు వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కాలసాని చెన్నారావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ అధికారి టిప్పు సుల్తాన్, పాల్గొన్నారు.

### మొక్కజొన్న కొనుగోలు చేయాలి


కలెక్టరుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: మెట్టప్రాంత రైతులు సాగుచేసిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి బుధవారం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావుకు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తిరువూరు నియోజకవర్గంలో ఈ ఏడాది మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపారన్నారు. దిగుబడులు వచ్చినా సమీపంలో మార్కెటింగ్ సదుపాయం లేదని పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలని కోరారు. అన్ని ఆర్బీకేలలో వరి కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభించాలని కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు.

## ఇండిపెండెంట్లకు విమర్శించే అర్హత లేదు

ఇబ్రహీంపట్నం: ఇండిపెండెంటు కౌన్సిలర్ శ్రీలక్ష్మీ టీడీపీ నాయకుల ప్రోత్సాహంతో వైఎస్సార్ సీపీ నాయకులను విమర్శించే అర్హత లేదని ఎంపీపీ పాలడుగు జోత్స్న అన్నారు. టీడీపీ నాయకుల విమర్శలను బుధవారం ఆమె ఖండించారు. పార్టీకి అనేక రకాలుగా సేవలు చేసి ఎంపీపీగా ఎదిగిన తమ కుటుంబాన్ని డబ్బులకు అమ్ముడు బోయిన నీకు విమర్శించే అర్హత లేదన్నారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి ఉమాకు లేదని కౌన్సిలర్ గుంజా శ్రీనివాసరావు అన్నారు. ఉమామహేశ్వరరావు టీడీపీ పిల్ల సైకోలతో విమర్శలు చేయించడం మానుకోవాలని జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు నల్లమోతు ప్రసన్నబోస్ అన్నారు. పీఏసీఎస్ చైర్మన్ శివారెడ్డి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్.శివశంకరరావు, బెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే దేవకుమారి, కన్వీనర్ల కోఆర్డినేటర్ లంకే అంకమోహనరావు, చిన్నయ్య, దయాకర్, ప్రకాష్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## విజ్ఞానం పెంపొందించుకోవాలి

గానుగపాడు(తిరువూరు): విద్యార్థులు వేసవిలో సమయం వృథా చేసుకోకుండా విజ్ఞానం పెంపొందించే పుస్తకాలు చదవాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ ఎం.రాంప్రదీప్ సూచించారు. మండలంలోని గానుగపాడులో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే ప్రణాళికను రాంప్రదీప్, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి కృష్ణకుమారి బుధవారం వివరించారు. ఆటపాటలతో పాటు కొంతసమయం విజ్ఞానదాయక పుస్తకాల పఠనం కోసం కేటాయించాలని, ఇది భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వారు తెలిపారు.

## నేడు లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం

చాట్రాయి: మండలంలోని చనుబండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో గురువారం లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు మంగళతోరణ, 9 గంటలకు విఘ్నేయణ్యేశ్వర పూజ, 10 గంటలకు అన్నదానం, రాత్రి 8.15 గంటలకు స్వామి వారి అనంతరం గ్రామంలో ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## హెల్మెట్ ధారణ తప్పనిసరి

ఆగిరిపల్లి: హెల్మెట్ ధరించి వాహనదారులు ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని ఎస్సై ఎస్.చంటిబాబు సూచించారు. ఆగిరిపల్లి మండలం వడ్లమానులో విజయవాడ – నూజివీడు రోడ్డులో భద్రత – హెల్మెట్ ధారణపై బుధవారం అవగాహన కల్పించారు.

# విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దు


ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

తిరువూరు: ఆరుకోట్ల ఆంధ్రులు ఉద్యమించి సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వామపక్షాల పిలుపు మేరకు తిరువూరులో బుధవారం ఆ పార్టీ నాయకులు ధర్నా చేశారు. స్థానిక బోస్ సెంటర్లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ ఈ ఆందోళన జరిపారు. వామపక్షాల నాయకులు గుళ్లపల్లి వెంకటరత్నం, తూము కృష్ణయ్య, నాగుల్‌మీరా, ఎస్వీ భద్రం, సుందరరావు, ఆలీబాబా, నాగేంద్రప్రసాద్, బీ వెంకటేశ్వరరావు, ముత్తయ్య, సీహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### అలుపెరగని పోరాటం

ఇబ్రహీంపట్నం: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం రాస్తారోకో చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవానికి సజీవసాక్ష్యం అయిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కోసం అలుపెరుగని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, డీసీసీ కార్యదర్శి బొర్రా కిరణ్, ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ పాల్గొన్నారు.